
# నిదానమే ప్రధానము

ముసునూరి వీరయ్యశాస్త్రి



భీమవరం వెళ్ళే బస్సుకోసం ఎదురుచూస్తున్న రమేష్ మిత్రబృందానికి దూరం నుంచి వస్తున్న రెండు బస్సులు కనిపించాయి. మెయిన్ రోడ్డు రద్దీగా ఉండటంవల్ల బస్‌స్టాప్ దగ్గరకి రావడానికి అయిదు నిముషాలు పట్టింది. బస్సులు వచ్చి ఆగగానే జనం పరుగెత్తసాగారు. ఏ బస్సులో ఎక్కాలో తెలియక కొంతమంది నిలబడి ఆలోచనల్లో పడ్డారు.

"ఒరే, వెనక బస్సు లిమిటెడ్ హాల్టుస్. ఆ బస్సు ఎక్కుదాం" అన్నాడు రమేష్ మిత్రుల నుద్దేశించి.

మిగతా మిత్రబృందం సరేనన్నారు.

అందరూ బిలబిలా బస్సెక్కేశారు.

"ఒరే, డ్రైవర్ కుర్రవాడేరోయ్" బస్సెక్కాక ఆనందం పట్టలేక అన్నాడు వీరేంద్ర.

రమేష్ నవ్వి, "అయితే మన బస్సు గాలిలో తేలి పోతుందన్నమాట" అన్నాడు.

'అంతేగదా!' మిగతావారు అతని తీర్మానాన్ని ఆమోదించారు.

లిమిటెడ్ హాల్టుస్, ముందున్న పాసెంజర్ బస్సును తప్పించుకుని బయలుదేరింది.

రమేష్ తన అన్నగారి పెళ్ళికి మిత్రులను దగ్గరుండి తీసుకెడుతున్నాడు. అందరూ మంచి ఉత్సాహవంతులే ! అల్లరి తమ సొత్తుగా ఉంది. వారి ప్రవర్తన పెళ్ళివారి బస్సులా హడావిడిగా— అల్లరిగా— ఆందోళన కలిగించేలా వుంది బస్సు లోపల.

బస్ గూడెం దాటింది. ఇంతలో—

వెన్క నుంచి పాసింజర్ బస్సు ఎవరూ ఊహించని విధంగా లి. బస్సును ఓవర్ టేక్ చేసుకొని వెళ్ళిపోవడం దానిలోని రమేష్ బృందానికి మనస్తాపం కలిగిస్తోంది. ఇది తల తీసేసినట్లుగా అనిపిస్తోంది. అంతేకాదు, పా—బస్సు కండక్టర్ చూసిన చూపు, నవ్విన నవ్వు వారిని దహించివేస్తోంది.

"ఏమండీ డ్రైవర్‌గారూ ఇది బస్సా, రెండెడ్ల బండా !" కడుపులో మంట బయట పెట్టేశాడు రమేష్.

"డ్రైవర్ బాబుది కొత్త సర్వీసేమో !"

"కొత్త సర్వీసైతే ఈ బస్సెందుకు డ్యూటీ ఎక్కాలట్ట, మనల్ని చంపకపోతే. ఏదో తొందరగా వెడుతుందని యిదెక్కితే—సాయంత్రా నికి చేరేట్టుంది." చికాగ్గా అన్నాడు శర్మ.

అయినా వేగం పెరగలేదు.

"డ్రైవర్ బాబగా" అని, మిత్రుల చెవుల్లో ఏదో చెప్పాడు రమేష్.

జిందాబాద్ ఏకకంఠంతో అరిచారందరు.

"వేగం పెరగని ఈ బస్సు" అన్నాడు రమేష్.

"దీర్ఘాయుష్మాన్ భవ"

అలా సాగుతున్నవారి అల్లరి సాటి ప్రయాణీకులకి ఇబ్బంది కలిగించింది. ఒకరిద్దరు చెప్పారు. అయినా ఆగుతుందా వారి అల్లరి. స్పీడుగా బస్సు నడపని డ్రైవర్లందరూ వారి దృష్టిలో దద్దమ్మలే !

ముసునూరు వచ్చింది. అక్కడ స్టేజి దగ్గర పా. బస్సు ఆగింది. రమేష్ ఆనంద పడిపోతూ, "గురూ, మనం పాసెంజర్ బస్సును దాటి వెళ్ళిపోతున్నాం" అన్నాడు జనాన్ని దింపు కుంటున్న పా. బస్సును చూసి. వారందరూ ఆశించినట్టుగానే లి. బస్సు ముందుకు వచ్చింది. వేగం కూడా పెరిగింది. యువకులు పాటల్లో పడ్డారు. ముసలివాణ్ణి సైతం నవయువకునిలా చేసే వాతావరణం బస్సులో క్రియేటుచేస్తున్నారు యువకబృందం.

ఇంతలో పిడుగుపాటులా పా. బస్సురావడం లి. బస్సు డ్రైవర్ దానికి దారి ఇవ్వడం, అది రాకెట్‌లా ముందుకు దూసుకుపోవడం—బస్సులో యువకులు నీరుకారిపోవడం క్షణాల్లో జరిగి పోయాయి. మళ్ళీ యువకులు డ్రైవర్ని రెచ్చ గొట్టాలని, అతనిలో పౌరుషం తేవాలని అల్లరి మొదలుపెట్టారు. అయినా లాభం లేకపోతోంది.

"ఖర్మకాలి ఈబస్సెక్కామునాయనోయ్" పైకి రాగాలు తీసాడు రమేష్.

"పెళ్ళికి బయలుదేరిన వాళ్ళం, కార్యానికి వెళ్ళేలా వున్నాము దేవుడోయ్" వీరేంద్ర అన్నాడు.

తప్పట్లు .........




''డ్రైవర్''
''డాన్ డాన్''
''కండక్టర్''
''డాన్ డాన్''
''బస్సు వేగం''
''పెరగాలి''

# నిదానమే ప్రధానము

ఇంతలో బస్సు ఆగింది.

''ఏమయ్య బాబూ, చీమ ఏద్నైనా అడ్డం వచ్చిందా, బస్సాపావు'' గట్టిగానే అన్నాడు శర్మ.

బస్సులో నవ్వులు.

''ఏమిటయ్యా మీ అల్లరి. మంచి మర్యాదా లేకుండా ఏమిటి ?'' కోపంగా అడిగాడు డ్రైవర్ బస్సు ఆపి.

రమేష్ నిలబడి, ''అవునయ్యా, ఈ బస్సు పేరేమిటి ? ఈ నత్తనడక ఏమిటి?'' అడిగాడు నిలదీస్తూ.

డ్రైవర్ వెంటనే, ''ఇది లిమిటెడ్ హాల్ట్స బస్సేగానీ, ఎక్స్‌ప్రెస్ బస్ కాదు'' అన్నాడు.

నవ్వులు.

''పాసెంజర్ బస్సు కూడా కాదు నాయనా, యిది–రెండెడ్లబండి'' హేళనగా అన్నాడు శర్మ.

బస్సు మళ్ళీ ముందుక్కదిలింది.

కనుచూపు మేరలో కనుపించని విధంగా వెళ్లిపోయింది పా. బస్సు.

పెంటపాడు దాటింది లి. బస్సు. చిలకం పాడు చేరుకుంది. హఠాత్తుగా సడన్‌బ్రేకులో ఆగిపోయింది లి. బస్సు. బస్సులో వాళ్ళందరు కంగారుపడ్డారు. లేచి చూసారు. ఎదురుగా జనం. అక్కడి వాతావరణం చాలా గందర గోళంగా వుంది. లి. బస్సులోని జనం కూడా దిగి, అక్కడ దృశ్యంచూసి కొయ్యబారిపోయారు. లి. బస్సును తప్పించుకుని ముందుకురికిన పా. బస్సు కాల్వలో పడింది.

పిల్లలు ఏడుస్తున్నారు.

పెద్దవాళ్ళు దెబ్బలుతగిలి మూల్గుతున్నారు. ఇంకా బస్సులోంచి జనాన్ని బయటకి తీస్తున్నారు అక్కడి గ్రామస్థులు. ఒక మూల బస్ డ్రైవర్ కాలు విరిగి, విపరీతంగా బాధ పడుతున్నాడు. కండక్టర్‌కి పెద్దగాయాలేమీ తగల్లేదుగాని, తల బొప్పె కట్టింది. బస్సు దగ్గర జనాన్ని లాగే పనిలో నిమగ్నమై ఉన్నాడు. కార్యరంగంలోకి దిగారు రమేష్ బృందం. చాలా జనాన్ని రక్షింప గలిగారు. అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణభయం లేదు. అందరూ క్షేమంగా బయటికి రాగలిగారు.

వాతావరణం కాస్త మెరుగుపడింది.

లి. బస్సు డ్రైవర్ నెమ్మదిగా రమేష్ బృందాన్ని చేరుకున్నాడు. మీరు ఆశించిన వేగానికి ఫలితం ఏమిటో చూసారాన్నట్లున్న అతని చూపుల్ని తట్టుకోలేకపోయారు వారు.

''చాలా ఘోరం జరిగింది'' అన్నాడు రమేష్ బాధగా.

''అవునండి. ఎప్పటికప్పుడు ఆ డ్రైవర్‌కి చెబుతూనే ఉంటాము. కానీ వినడు. స్పీడు లేకపోతే జీవితంలో పసలేదంటాడు. మీరుకూడా అతన్నే సమర్థిస్తారనుకుంటా'' అన్నాడు డ్రైవర్ అక్కడకు చేరిన యువకుల నుద్దేశించి.

''అయ్యబాబోయ్, వద్దండి బాబూ ! కళ్ళారా చూసాకా కూడా మా అభిప్రాయాన్ని మార్చుకోకపోతే ఎలా ? మీ ఆర్టీసివారి స్లోగను వుందిగదా ! 'నిదానమే ప్రధానమని' అదే మా ఆదర్శం కూడా!'' అని రమేష్ అనేసరికి నవ్వులు వెల్లివిరిసాయి అక్కడ. ★